క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

వెంకటమ్మ మృతికి సంతాపం



వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామానికి చెందిన బోళ్ల వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మృతురాలి కుటుంబాన్ని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిలు పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్‌రావు, నాతాల వెంకట్‌రెడ్డి, దేవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దిలీప్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



పెన్‌పహాడ్ : భక్తాళాపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నాగారం : భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్‌ను గెలిపించాలని ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.

సూర్యాపేట : ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కేసారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మోసగించిన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

పెన్‌పహాడ్ : ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. ఆదివారం భక్తాళాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి



వెంకెపల్లిలో సీపీఎంలో చేరుతున్న మాజీ సర్పంచ్ చూడి మధుసూదన్‌రెడ్డి

నూతనకల్ : భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపునకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం యడవెల్లి, వెంకెపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకెపల్లి మాజీ సర్పంచ్ చూడి మధుసూదన్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి సీపీఎంలో చేరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, దండా వెంకట్‌రెడ్డి, వేల్పుల వెంకన్న, బత్తుల జనార్దన్, గాడ్దుల జానయ్య, తొనుకునూరి ఉప్పలయ్య, ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంతోనే ప్రజా సమస్యల పరిష్కారం

అర్వపల్లి : సీపీఎంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ పర్సాయపల్లిలో ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

మద్దిరాల : సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా..

- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

అర్వపల్లి : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 32 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 24,171మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి.

కనీస సౌకర్యాలపై దృష్టి..

పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల కల్పనకై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యాత్మక కేంద్రాలలో వెబ్ కెమెరాల బిగింపు పనులు పూర్తి చేశారు. అన్ని బూతులలో ఈసారి కొత్తగా వివిధ అంశాలతో కూడిన వాల్‌రైటింగ్ రాయించారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన చోట ర్యాంపుల నిర్మాణం చేపట్టారు. అన్ని కేంద్రాల్లో కరెంట్ పనులు పూర్తి చేయించి నీటి వసతి కల్పించి మరుగుదొడ్లు మరమ్మతు చేయించి వినియోగంలోకి తెచ్చారు. అయితే ఆయా గ్రామాల్లోని కేంద్రాలను గ్రామ పంచాయతీ కార్మికులతో కార్యదర్శులు ప్రతిరోజు శుభ్రం చేయిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఓటర్లు క్యూలైన్‌లో వెళ్లడానికి బారికేడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు.



అర్వపల్లి పోలింగ్ కేంద్రంలో బిగించిన వెబ్ కెమెరాను పరిశీలిస్తున్న సిబ్బంది



అర్వపల్లి పోలింగ్ కేంద్రంలో శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

కనీస వసతులు కల్పించాం



మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కనీస వసతులు కల్పించడం జరిగింది. ప్రతిరోజు గ్రామ పంచాయతీ కార్మికులతో పోలింగ్ కేంద్రాలను శుభ్రం చేయిస్తున్నాం. నీరు, విద్యుత్, మరుగుదొడ్ల పనులు పూర్తయ్యాయి.

– సందీప్‌కుమార్, ఎంపీడీఓ

32 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



జాజిరెడ్డిగూడెం మండలంలో పార్లమెంట్ ఎన్నికలకు 32 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశాం. దివ్యాంగుల కోసం అవసరమైన చోట ర్యాంపుల నిర్మాణం చేపట్టాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వాల్‌రైటింగ్ పూర్తి చేశాం. వెబ్ కెమెరాల ఏర్పాటు కూడా పూర్తయింది.

– జక్కర్తి శ్రీనివాసులు, తహసీల్దార్

బీజేపీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



మాట్లాడుతున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట : గత పదేళ్లుగా బీజేపీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సోలిపేట, రామచంద్రాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ గత పదేళ్లుగా మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. రామమందిరం, అక్షింతల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని తెలిపారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా వీరమళ్ల వెంకన్న



నూతనకల్ : నూతనకల్ గ్రామ ట్రాక్టర్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా వీరమళ్ల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నూతనకల్ గ్రామంలో నిర్వహించిన ట్రాక్టర్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సైదిరెడ్డి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాబాది ఉపేందర్‌రెడ్డిలతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, బొల్లంపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్ పరిశీలించారు. బూతులలో ఏర్పాట్లపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి పోలింగ్ బూతులలో బిగించిన వెబ్ కెమెరాలను పరిశీలించారు. కార్యదర్శులు ప్రతిరోజు కేంద్రాలను పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నెహ్రూనాయక్, శ్రావణి, మాధవిక, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతాం



సూర్యాపేటలో ప్రచారం చేస్తున్న రమేష్‌రెడ్డి



సూర్యాపేటలోని 44వ వార్డులో ప్రచారం..

భానుపురి : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేసి తీరుతుందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 30, 43వ వార్డుల్లో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షఫీఉల్లా, వెలుగు వెంకన్న, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిని గెలిపించాలి

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని పట్టణంలోని 44వ వార్డులో ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మన్సూర్, నరేంద్రుని శ్రీధర్, షాదం దామోదర్ రెడ్డి, రిజ్వాన్, బండారు కృష్ణ, మధుకర్ రెడ్డి, వెంకటనారాయణ, జమాల్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ వివరించాలి



బొల్లంపల్లిలో బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని

అర్వపల్లి : ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ శ్రేణులు ఇంటింటికీ వివరించి ఓట్లడగాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని బొల్లంపల్లిలో ఆదివారం గ్రామానికి చెందిన బొమ్మిడి రామ్మూర్తి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు సుమారు 50మందికి పైగా బీజేపీలో చేరారు. వారికి సంకినేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంకినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల హామీల్లో విఫలమైన కాంగ్రెస్‌ను, పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి దోచుకతిన్న బీఆర్‌ఎస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపా రవికుమార్, మల్లెపాక సాయిబాబా, మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, మీలా కిష్టయ్య, కూర శంకర్, కీర్తి వెంకటేశ్వర్లు, వేముల సత్తయ్య, చవ్వ సురేష్, మారపాక రాములు, బింగి రమేష్, బైరబోయిన నాగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లిలో సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వవిద్యార్థులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీ వెంకటేశ్వర సహకార జూనియర్ కళాశాల 2002–2004 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అర్వపల్లిలో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మామిడాల రామ్మూర్తి, లెక్చరర్లు డి. వెంకటేశ్వర్లు, వి.రవి, ఎస్. వెంకటేశ్వర్లు, పి. వెంకటేశ్వర్లు, ఆర్. రమేష్, సమ్మేళనం నిర్వహణ కమిటీ సభ్యులు జ్యోతుల సుధాకర్, వీరనారాయణ, పరిపూర్ణాచారి, మాధవి, జానకమ్మ, మహేష్, మురళి, నాగుల్‌మీరా, ఎల్లయ్య పాల్గొన్నారు.

రచయితలపై దాడి చేయడం తగదు

- సూర్యాపేట సామాజిక ఐక్య వేదిక కన్వీనర్ భద్రయ్య



రచయితలపై దాడులను ఖండిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సూర్యాపేటటౌన్ : వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో రచయితలు గత నెల 28న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులోకి హిందుత్వ ఫాసిస్టు శక్తులు చొరబడి రచయితలపై భౌతిక దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు సూర్యాపేట సామాజిక ఐక్య వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన చర్చా గోష్టిలో ఆయన పాల్గొని మాట్లాడారు. లౌకిక భావనలు కలిగి ఉండటం, వాటిని వెల్లడించడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది తల్లమల్ల హస్సేన్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, రమణాచారి, ఆయా సంఘాల నాయకులు నాగేందర్ నాయక్, కరీం, నారబోయిన వెంకట్‌యాదవ్, చామకూరి నర్సయ్య, కోటయ్య, యోగానంద్, అంతయ్య, సిద్ధిక్, పాషా, ఆనంద్, భాస్కర్, సైదులు, వెంకటయ్య, దేవేందర్, కృష్ణ పాల్గొన్నారు.

అరుణోదయ రామారావుకు ఘన నివాళి



సూర్యాపేట : రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు



ఆత్మకూర్ (ఎస్) : బొప్పారంలో రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట : అరుణోదయ రామారావు ఆశయాల సాధనకు పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం అరుణోదయ రామారావు 5వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రేణుక, కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్రఅఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

అరుణోదయ రామారావు 5వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, నాయకులు కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, సాయబు హుసేన్, గజ్జల మల్లారెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో అరుణోదయ రామారావు 5వ వర్ధంతిని ఆదివారం న్యూడెమోక్రసీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర ఉమేష్, దేశోజు మధు, పగడాల సుధాకర్, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, ఎర్ర ఉపేందర్, గణేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



తిరుమలగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు



నూతనకల్ : శంకర్‌నాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. ఆదివారం తిరుమలగిరిలోని తన నివాసంలో గొట్టిపర్తి గ్రామ ఎంపీటీసీ కేతిరెడ్డి లతావిజయ్‌కుమార్‌రెడ్డి, వెంపటి గ్రామ మాజీ సర్పంచ్ అబ్బగాని పద్మసత్యనారాయణతోపాటు తుంగతుర్తిలోని ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 100 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు, మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, చిలుకల వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నూతనకల్ : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. ఆదివారం సోమ్లాతండాలో మాజీ సర్పంచ్ గుగులోతు శంకర్ నాయక్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, ఎంపీటీసీ గుగులోతు సజ్జన్ నాయక్, మాజీ సర్పంచ్ అప్పానాయక్, మాజీ ఉప సర్పంచ్ మధార్, గుగులోతు రవి, రాజు, మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనే విజయానికి సోపానం

భానుపురి : సత్ప్రవర్తనే విజయానికి సోపానాలు అని సామాజిక వేత్త, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని భగవద్గీత మందిరంలో దేవాలయాలు, ధార్మిక ఐక్య వేదిక ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతుల కన్వీనర్ నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్, భగవద్గీత మందిర అధ్యక్షులు మొరిశెట్టి రామ్మూర్తి, జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, నాగవెల్లి దశరథ, దేవులపల్లి ప్రశాంతి, రాగి భాస్కరా చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌కు మద్దతు పలుకుదాం

పెన్‌పహాడ్ : దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాల్సిన ఆవశ్యకత ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ జన సమితి బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని జన సమితి ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి కోరారు. ఆదివారం నూర్జహాన్‌పేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పానుగోతు సూర్యనారాయణ, దేవిరెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం.. అకాల వర్షం

భానుపురి : సూర్యాపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. గంటన్నర తర్వాత వర్షం తగ్గినా.. ఉరుములు, మెరుపులు ఆగలేదు. ఈదురుగాలుల కారణంగా పలు వార్డుల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో సూర్యాపేట పట్టణంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలోని ఎంజీరోడ్డు, కొత్త బస్టాండ్ చౌరస్తాతో పాటు పలుచోట్ల రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. జనగామ క్రాస్‌రోడ్డులోని ఓ హోటల్ వెనుక తాటిచెట్టుపై పిడుగుపడింది.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురు గాలి వీచింది. అలాగే ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఇళ్ల పైకప్పులు, రేకులు, దుకాణాల బోర్డులు కొట్టుకపోయాయి. చెట్లు కూలిపడ్డాయి. కొనుగోలు కేంద్రాల్లో, హైవే రోడ్లపై పోసిన ధాన్యం తడిసిపోయింది.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురు గాలుల బీభత్సంతోపాటు వడగండ్ల వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి.

ఆత్మకూరులో వడగండ్ల వాన

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా సాయంత్రం 5గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారింది. మరో గంటసేపటికే ఈదురుగాలులు వీచి వడగండ్ల వర్షం కురిసింది. ప్రస్తుతం మండలంలో వరి కోతలు పూర్తవగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు ఉన్నాయి. చాలాచోట్ల కొనుగోళ్లు చివరి దశకు చేరుకోగా ఆదివారం ఒక్కసారిగా కురిసిన వర్షానికి అక్కడక్కడ ధాన్యం రాశులు తడిచాయి.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. ఐకేపీ కేంద్రాల్లో పలువురి రైతుల ధాన్యం తడిసింది. చందుపట్లలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలోని తాటి చెట్టుపై పిడుగు పడింది.

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఆదివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటసేపు భారీ గాలి వీయడంతో తిరుమలగిరి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు నేలకొరిగాయి. ఐకేపీ కేంద్రాల్లోకి రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడిసింది. తాటిపాముల గ్రామంలో ఇంటి పైరేకులు ఊడి మీదపడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అర్ధరాత్రి వరకు విద్యుత్ పునరుద్ధరణ చేయకపోవడంతో మండలం మొత్తం అంధకారంలో ఉంది.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ఈదురుగాలికి రోడ్డుపై కూలిపడిన చెట్టు



భానుపురి : జనగామ క్రాస్‌రోడ్డులో పిడుగుపడి కాలిపోతున్న తాడిచెట్టు

పలు చోట్ల విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు

పెన్‌పహాడ్ : మండలంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మహ్మదాపురం గ్రామంలో భారీ చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరగడంతో పాటు 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఒక ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె పైనుంచి కిందపడింది. దూపహాడ్, మాచారం గ్రామాల్లో ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగల తెగిపడ్డాయి. విద్యుత్ ఏఈ రమేష్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

దెబ్బతిన్న మామిడి, నిమ్మ తోటలు..

నాగారం : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి మండలంలో నిమ్మ, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మామిడి, నిమ్మకాయలు నేలరాలడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు నాగారం–తుంగతుర్తి ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. నాగారం మండల కేంద్రం సమీపంలో జీబీకే సిమెంట్ బ్రిక్స్ ఎదురుగా తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. నాగారం గ్రామ శివారులోని శివాలయం సమీపంలో పిడుగు పడింది. ఐకేపీ కేంద్రాల్లో స్వల్పంగా ధాన్యం తడిసింది. నాగారంబంగ్లాలోని వసుధ రైస్ మిల్లులో గాలివాన బీభత్సానికి మిల్లు పైకప్పు రేకులు లేచిపోగా, ఐకేపీల నుంచి సేకరించిన సుమారు 1500 ధాన్యం బస్తాలు తడిశాయి. మిల్లులోని మేజర్ మిషన్ తడిసి సుమారు రూ.6లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు మిల్లు యజమాని రమేష్ తెలిపారు.

నూతనకల్ : మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, వర్షానికి చెట్లు నేలకూలాయి. చిల్పకుంట్ల, యడవెల్లితోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ జె.సైదులు జేసీబీ సహాయంతో చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



తిరుమలగిరిలో నేలకొరిగిన చెట్లు



నూతనకల్‌లోని ప్రధాన రహదారిపై చెట్లను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది